క్లుప్తంగా

నేడు గడప గడపకు బీజేపీ

మాడుగులపల్లి : మండల కేంద్రంలో గడప గడపకు బీజేపీ కార్యక్రమాన్ని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ప్రారంభించనున్నట్లు బీజేపీ మండలాధ్యక్షుడు బొమ్మకంటి నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు, శక్తి కేంద్రం ఇన్‌చార్జులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, ఐదు గ్రామాల బూత్ అధ్యక్షులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పని చేయాలని కోరారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

వేములపల్లి : మండల కేంద్రంలోని ఎస్‌ఎస్పీ క్యాంపు కాలనీకి చెందిన గౌరోజు శంకరాచారి అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి గురువారం ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రొండి శ్రీనివాస్, నాయకులు చౌగాని సీతారాములు, పాల్వాయి రాంరెడ్డి, రెమడాల భిక్షం, కోడిరెక్క వెంకన్న, సైదులు, శ్రీనివాస్, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

చింతపల్లి : చింతపల్లి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నవంబర్ 7న నిర్వహించనున్న మాదిగల విశ్వరూప మహాపాద యాత్ర పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించిచారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ రాష్ట్రనాయకులు వింజమూరి కృష్ణయ్య మాట్లాడుతూ ఈనెల 7న ప్రారంభమైన పాద యాత్ర నవంబర్7న హైదరాబాద్‌లో ముగుస్తుందన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించే మహాసభకు ఎమ్మార్పీఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమలో యేసు, మాసని పెద్దయ్య, నల్లా శంకర్, భాస్కర్, వెంకటయ్య, కాశయ్య, మల్లయ్య, జంగయ్య, నర్సింహా, చంద్రయ్య తదితరులున్నారు.

గ్రామ కార్యదర్శిపై ఫిర్యాదు

కొండమల్లేపల్లి : మండలంలోని కొత్తబాయి పంచాయతీ కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సర్పంచ్ జబ్బు యాదయ్య గురువారం కొండమల్లేపల్లి ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రెచ్చగొట్టేలా వార్తలు వ్యాప్తి చేస్తే చర్యలు

కొండమల్లేపల్లి : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రజలను రెచ్చగొట్టేలా వార్తలు వ్యాప్తి చేస్తే చర్యలు ఉంటాయని కొండమల్లేపల్లి ఎస్‌ఐ వీరబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోషల్ మీడియా, వాట్సాప్, ఫేస్ బుక్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు, ప్రజలను రెచ్చగొట్టే ప్రచారాలు చేస్తే చట్టరీత్య చర్యలు ఉంటాయని తెలిపారు.

పత్తి విక్రయానికి ఆధార్ తప్పనిసరి

మాడుగులపల్లి : రైతులు సీసీఐ కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరి చేసిందని ఏఈఓ సైదానాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. బయోమెట్రిక్ నిర్ధారణ జరిగితేనే పత్తి విక్రయానికి ఆస్కారం ఉంటుందని వెల్లడించారు. రైతుల వేలిముద్రలు, ఐరిష్ ధ్రువీకరణ కాకుంటే ఓటీపీ, క్యూఆర్ స్కాన్ చేస్తారని, ఈ ఖరీఫ్ నుంచే ఈ విధానం అమలులోకి వచ్చిందని తెలిపారు. పత్తికి ప్రభుత్వం రూ. 7020 చెల్లిస్తుందని, ఆధార్ కార్డు లేని వారు ఆధార్ నమోదు పత్రం, పాన్‌కార్డు, ఓటరు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు పాస్ బుక్‌తో సీసీఐ కేంద్రానికి వెళ్లాలని సూచించారు.

కీడు వచ్చిందని ఊరంతా వనవాసం



వనవసానికి వెళ్తున్న మహిళలు

పెద్దవూర : మండలంలోని తెప్పలమడుగు గ్రామస్తులు గురువారం ఊరుకు కీడు వచ్చిందని ఇళ్లకు తాళాలు వేసి పిల్లాపాపలతో ఊరంతా వనవాసానికి వెళ్లారు. ఇరవై రోజులుగా గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఒకరితో ప్రారంభమైన జ్వరాలు ఇంట్లో ఉన్న అందరికి వస్తున్నాయి. ఏ ఇంట్లో చూసినా విష జ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎవరి చేతికి చూసినా ఐవీ క్యానలా బ్యాండేజీలే ఉండేవని, ఆస్పత్రుల చుట్టూ తిరిగామాని గ్రామస్తులు పేర్కొన్నారు. దీంతో గ్రామస్తులంతా కలిసి ఒక నిర్ణయానికి వచ్చి గ్రామానికి కీడు పట్టిందని ఊరంతా వనవసానికి వెళ్లాలని నిర్ణయించారు. దీంతో గురువారం గ్రామంలోని ఇళ్లకు తాళాలు వేసి వనభోజనాలకు వెళ్లి అక్కడే వంటావార్పు చేసుకుని పిల్లాపాపలతో సహపంక్తి భోజనాలు చేసి వచ్చారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

- భారీగా పట్టుబడిన నగదు, మద్యం



మిర్యాలగూడ అర్బన్: స్వాధీనం చేసుకున్న డబ్బులు చూపెడుతున్న పోలీసులు



వాడపల్లిలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మిర్యాలగూడ అర్బన్ : సరైన పత్రాలు లేకుండా డబ్బులు తరలిస్తుండగా పోలీసులు డబ్బులు స్వాధీనం చేసుకున్న ఘటన గురువారం పట్టణంలోని వన్‌టౌన్, టూ టౌన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో చింతరెడ్డి మధుసూదన్‌రెడ్డి అనే వ్యక్తి ఒక బ్యాగ్‌లో రూ.9 లక్షల రూపాయలు పెట్టుకుని వస్తున్న క్రమంలో అక్కడ తనిఖీలు చేస్తున్న పోలీసులు అతడి వద్ద ఉన్న బ్యాగ్‌ను పరిశీలించగా అందులో డబ్బులు ఉన్నట్లు గుర్తించారు. అదే విధంగా పట్టణంలోని ఈదులగూడ వద్ద తనిఖీలు చేస్తున్న టూ టౌన్ పోలీసులు సూర్యాపేట జిల్లా పాలకీడు మండలం యల్లాపురం గ్రామానికి చెందిన చంద్రకళ అనే మహిళ తన బ్యాగ్‌లో రూ.1.41 లక్షలు తీసుకొస్తుండగా గుర్తించిన పోలీసులు వాటిని కూడా స్వాధీనం చేసుకున్నారు. కాగా మధుసూదన్‌రెడ్డి వ్యాపార లావాదేవిల నిమిత్తం డబ్బులు తీసుకెళ్తున్నట్లు చెప్పగా కుటుంబ అవసరాల నిమిత్తం బ్యాంకు నుంచి డబ్బులు డ్రా చేసి తీసుకెళ్తున్నామని చంద్రకళ తెలిపింది. కాగా ఎన్నకల నియమావళి ప్రకారం డబ్బులకు సంబదించిన ఎలాంటి ఆధారాలు చూపించక పోవడంతో వాటిని సీజ్ చేసి ఆర్డీఓకు సరెండర్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ పి.రాఘవేందర్, టూటౌన్ సీఐ నరసింహారావు లు తెలిపారు.

మద్యం పట్టివేత

ఇద్దరు వ్యక్తుల నుంచి మద్యం స్వాధీనం చేసుకున్న సంఘటన పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. టూ టౌన్ ఎస్‌ఐ క్రిష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. శాంతినగర్ కు చెందిన బెల్ట్ షాపు నిర్వాహకుడు నక్క జానయ్య మద్యం బాటిళ్లను తరలిస్తుండగా వాహనాల తనిఖీలు చేస్తున్న క్రమంలో రూ.10 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాదీనం చేసుకున్నారు. అలాగే ప్రకాశ్‌నగర్‌కు చెందిన మరో బెల్ట్ షాపు నిర్వాహకుడు వారనాసి సుదర్శన్ వద్ద రూ.20 వేల విలువ చేసే మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో చెక్ పోస్టుల వద్ద మిర్యాలగూడ రూరల్ పోలీసులు ముమ్మరంగా తనిఖీలను చేపట్టారు. రోజు మాదిరిగానే గురువారం మిర్యాలగూడ మండలం ఆలగడప టోల్ ప్లాజ్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలానికి చెందిన ఆంజనేయులు రూ.11లక్షలు తీసుకొని మిర్యాలగూడకు వస్తుండగా మిర్యాలగూడ మండలం ఆలగడప టోల్ ప్లాజ్ వద్ద రూరల్ ఎస్‌ఐ దోరేపల్లి నర్సింహులు ఆధ్వర్యంలో చేపట్టిన తనిఖీల్లో ఆ నగదు పట్టుబడినట్లు ఆయన తెలిపారు. ఆ డబ్బుకు సంబంధించిన ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో జిల్లా ట్రెజరరీకి అప్పగించామని ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

11 లీటర్ల సారాయి పట్టివేత

చింతపల్లి : మండల పరిధిలోని బోటిమీదితండాలో గురువారం పోలీసులు నాటు సారా విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించారు. ఆ తండాకు చెందిన నేనావత్ రాములు 15లీటర్ల సారాయిని తన ఇంటి వద్ద దాచి ఉంచగా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్‌రెడ్డి తెలిపారు.

మిర్యాలగూడ : రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున దామరచర్ల మండలంలోని వాడపల్లి అంతరాష్ట్ర సరిహద్దు వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వినుకొండ పట్టణానికి చెందిన పోకూరి శ్రీనివాస్‌రావు అనే వ్యక్తి కారులో హైదరాబాద్‌కు వెళ్తుండగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో అతడి వద్ద రూ.90వేల నగదు లభించగా ఆ నగదుకు ఎలాంటి రుజువులు లేకపోవడంతో స్వాధీనం చేసుకుని మిర్యాలగూడ రిటర్నింగ్ ఆఫీసర్‌కు పంపించినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

నగదు పట్టివేత

పెద్దఅడిశర్లపల్లి : మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద గుడిపల్లి పోలీసుల తనిఖీలలో భాగంగా గురువారం పెద్దవూర మండలానికి చెందిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.1.20లక్షలు సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి తెలిపారు. ఆయన వెంట సిబ్బంది తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని పెండ్లిపాకల గ్రామానికి చెందిన తమ్మడబోయిన విష్ణుమూర్తి కొండమల్లేపల్లి నుండి హైదరాబాద్‌కు ఒక ప్రైవేటు వాహనంలో వెళ్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో రూ.68 వేలకు సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు ఎస్‌ఐ వీరబాబు తెలిపారు.

డిండి : రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున మండల కేంద్రంలోని పలు బెల్టు షాపులపై గురువారం పోలీసులు దాడి చేసారు. ఈ సందర్భంగా బెల్టు షాపు నిర్వహిస్తున్న నలుగురి వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ.సైదులు తెలిపారు. వైన్స్ షాపులో కాకుండా బయటి ప్రదేశాల్లో ఎక్కడైనా మద్యం విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రం పరిశీలన



ఇందుగులలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

మాడుగులపల్లి : మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని గురువారం నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. ఇందుగుల గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని శాలిగౌరారం సీఐ రాఘవరావుతో కలిసి పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత ఎన్నికల సమయంలో చోటు చేసుకున్న చెదురుమదురు ఘటనలపై ఆరా తీశారు. సమస్మాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెడుతున్నామని, ముందస్తు ప్రణాళికతోనే ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడం సాధ్యమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పక్కాగా అమలు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఎస్పీ వెంట ఎస్‌ఐ నరేష్ కుమార్, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.

చెరువులు నింపాలని కలెక్టర్‌కు వినతి

మిర్యాలగూడ అర్బన్ : నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీటితో ఆయకట్టులోని చెరువులను నింపాలని కోరుతూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ మహమూద్‌అలీ గురువారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. చెరువులు, బావులు నీరులేక ఎండి పోయాయని, పంటలను కాపాడేందుకు సాగర్ నీటితో చెరువులను నింపితే భూగర్భ జలాలు పెరిగి పంటలు చేతికొస్తాయని వినతిలో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

చింతపల్లి : మండల పరిధిలోని నెల్వలపల్లి గ్రామానికి చెందిన ఎంపీటీసీ బూరుగు ధనమ్మ భర్త మల్లయ్య మృతి చెందడంతో గురువారం ఆమె కుటుంబాన్ని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట సర్పంచ్ గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజాస్వామ్యాన్ని రక్షించుకుందాం



10కేఎం రన్ నిర్వహిస్తున్న యువకులు

మిర్యాలగూడ టౌన్ : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ గురువారం యువకులు 10కే రన్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి దామరచర్ల మండలం కొండ్రపోలు గ్రామం వరకు 12మంది కూడిన యువకులు 8 గ్రామాల మీదుగా 10కిలో మీటర్ల వరకు 10కె రన్ నిర్వహించారు. త్వరలో జరగనున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు ఈ రన్ నిర్వహించినట్లు యూత్ సభ్యులు పులి మురళి గౌడ్ తెలిపారు. ఈ 10కేఎం రన్‌లో కొమ్ము రమేష్, సుజిత్, కృష్ణ, మహేష్, అర్జున్, వీరబాబు, బుద్ధు, ప్రవీణ్, రాజు, యాదయ్య, స్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సీట్ల అమ్మకాలపై విచారణ జరిపించాలి

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో సీట్ల అమ్మకాలపై సమగ్ర విచారణ జరిపించాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓ సీటు బదిలీ విషయంలో ఆ గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు రూ.33వేల వరకు అడిగినట్లు ఒక విద్యార్థిని తండ్రి ఫోన్ రికార్డు చేశాడని తెలిపారు. ఈవిషయంపై పాఠశాలకు వెళ్లి గురుకు పాఠశాల యాజమాన్యాన్ని అడిగితే మీ దిక్కు ఉన్న చోట చెప్పుకొమ్మన్నారని తెలిపారు. అయితే ఈ విషయంపై రాష్ట్ర గురుకులం సెక్రటరీ నవీన్ నికోలాస్ ఫోన్ ద్వారా వివరించి, ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించి పాఠశాలలో అవినీతి, అక్రమాలకు తావులేకుండా చూడాలని కోరినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ఇందుగుల శివారులో పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభం

మాడుగులపల్లి : మాడుగులపల్లి-ఇందుగుల రహదారి వెంట 11 కేవీ విద్యుత్ లైన్‌లో ఒక స్తంభం పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. పొలంలోకి స్తంభం ఓ వైపు పూర్తిగా ఒరగడంతో ఎప్పుడు కూలుతుందోనని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలకు పలుచోట్ల కంపచెట్లు తగులుతున్నా.. పిచ్చి మొక్కలు అల్లుకుపోయినా తొలగించకుండా విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కూలే స్థితిలో ఉన్న స్తంభాన్ని తొలగించి మరొకటి ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

నేడు కంటి పరీక్షల శిబిరం

నల్లగొండ టౌన్ : తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు వనస్థలిపురం మాక్సి విజన్ మహాలక్ష్మి కంటి ఆస్పత్రి వారు యూటీఎఫ్ కార్యాలయంలో ఉచిత కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జగదీశ్‌చంద్ర, ప్రధాన కార్యదర్శి పందిరి శ్యాంసుందర్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉపాధి హామీకి నిధులు పెంచాలి

నల్లగొండ రూరల్ : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల జిల్లా కన్వీనర్ దండంపల్లి సరోజ పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని పట్టణ ప్రాంతాల్లో అమలు చేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీకి నిధులు తగ్గించిందన్నారు. రోజుకు రూ 600 కూలీ ఇవ్వాలని కోరారు. కూలీలకు కూలీ బంధు పథకం ప్రవేశపెట్టాలని, పని ప్రదేశంలో ఎవరైనా మృతి చెందినట్లయితే రూ 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ రవీందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ మండల అధ్యక్షుడు కట్ట అంజయ్య, కార్యదర్శి గోలి నర్సింహ, శ్రీను, చంద్రయ్య, యాదయ్య పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

నల్లగొండ టౌన్ : ఈ నెల 17 నుంచి 24 వరకు చెన్నైలో జరిగే సౌత్‌జోన్ జాతీయ హాకీ పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి తొమ్మిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారని హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కూతురు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇమామ్‌కరీం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలుర విభాగంలో కుంచెం రాకేష్, గోగుల అఖిల్, ధీరావత్ శంకర్, బాలికల విభాగంలోయాదాద్రి భువనగిరి జిల్లాకు చెందిన ధీరావత్ జాన్సీ, గుణగంటి సిరి, వరికుప్పల లిఖిత, ఉయ్యాల సిరిస్పందన, నల్ల ప్రీతి, మట్టపల్లి శివాని, ఎంపికయ్యారని పేర్కొన్నారు.

నేటినుంచి జోనల్‌స్థాయి క్రీడా పోటీలు



క్రీడా పోటీలకు ముస్తాబైన మైదానం

డిండి : మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల (బాలికల)పాఠశాలలో నేటి నుంచి 16వ తేదీ వరకు తొమ్మిదో జోనల్‌స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.పద్మ తెలిపారు. గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ క్రీడా పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని తొమ్మిది గురుకుల పాఠశాలల నుంచి 765 మంది విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, హైజంప్‌తోపాటు అథ్లెటిక్స్ క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి గురుకులాల ఓఎస్‌డీ(డీఏఆర్) ప్రశాంతి ముఖ్య అతిథిగా అదేవిధంగా నిర్వహణకు 9 పాఠశాలలకు సంబంధించిన ఆర్‌సీఓ లు, డీసీఓలు, పీడీలు, పీఈటీలు హాజరవుతున్నారపేర్కొన్నారు. క్రీడా పోటీలకు హాజరయ్యే వారందరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఆమె వెంట పీడీలు, పీఈటీలు తదితరులున్నారు.

బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న గోపిరెడ్డి లచ్చిరెడ్డి

అడవిదేవులపల్లి : బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సైనికుడిలా పనిచేయాలని ఆ పార్టీ ప్రభారీ గోపిరెడ్డి లచ్చిరెడ్డి, పార్టీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల జనరల్ బాడీ సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. రాబోయో అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు ఇప్పటి నుంచి ప్రతి పార్టీ కార్యకర్త ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ కేసీఆర్ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజల్లో చైతన్యం తీసుకరావాలన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొండల్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో జిల్లా కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు సీతారాంరెడి, నాయకులు కూరాకుల రవికుమార్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమావత్ రవీందర్, యువమోర్చా అధ్యక్షులు పానూగోతు కోటేశ్ తదితరులున్నారు.

శంకర్‌నాయక్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మిర్యాలగూడ : బడుగు, బలహీనవర్గానికి చెందిన డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్‌ను కాంగ్రెస్ పార్టీ మిర్యాలగూడ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పగిడి జీడయ్యయాదవ్ డిమాండ్ చేశారు. గురువారం దామరచర్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం 30ఏళ్లుగా పనిచేస్తూ మండల యూత్ అధ్యక్షుడిగా, జెడ్పీటీసీగా, ఎంపీపీగా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, పట్టణ అధ్యక్షుడిగా, డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికై పార్టీ బలోపేతం కృషి చేశారన్నారు. కాంగ్రెస్ అధిష్టానం శంకర్‌నాయక్ సేవలను గుర్తించి ఎమ్మెల్యేగా అభ్యర్థిగా ప్రకటించాలని ఆయన కోరారు. ఈ కార్యకరమంలో ఆదివాసి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ ఆడావత్ నాగునాయక్, నాయకులు వద్త్యానాయక్, కృష్ణనాయక్, శారదనాయక్, సద్దాం, వెంకటేశ్వర్లు, శ్రీను, ఖాదర్, రవీందర్, ఆనంద్, శివ, జాకీర్, మాజీద్, నాగేశ్వర్‌రావు, వినోద్, రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గుర్రంపోడు : ఈ నెల 16,నుంచి 19 తేదీ వరకు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించే అండర్ 19 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు మండలంలోని పిట్టలగూడెం గ్రామంలోని మైనార్టీ జూనియర్ కళాశాల విద్యార్థి పి. సాయి మనోజ్, నితిన్‌లు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూఖ్ తెలిపారు. ఈ నెల 11న మిర్యాలగూడెంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషకరమన్నారు. ఎంపికైన విద్యార్థులను పీఈటీ జావేద్, వార్డెన్ సయ్యద్‌మియా, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు బహూకరణ



విద్యార్థులకు ప్లేట్లు అందజేస్తున్న దాత

మిర్యాలగూడ టౌన్ : మండలంలోని కొత్తపేట గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుకు ప్లేట్లను గురువారం దాత విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య ఆధ్వర్యంలో 50మంది విద్యార్థులకు స్థానిక సర్పంచ్ లక్ష్మీదేవమ్మ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి సాయం అందించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద సాయన్న, లింగరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోలి కృష్ణయ్య, ఉపాధ్యాయులు లాలు, అంగన్‌వాడీ టీచర్ నాగేంద్ర, మహిళా సంఘాల లీడర్లు శారధ, నారయణమ్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ టౌన్ : ఎంవీఎస్ ట్రస్టు ఆధ్వర్యంలో ఐఎంఏ సహకారంతో జిల్లా కేంద్రంలోని సత్యవతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్‌లో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్థో సర్జన్ డాక్టర్ మల్లు అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆహార అలవాట్లను మార్పుచేసుకుని, నడక, స్విమ్మింగ్ చేయడం వల్ల ఆర్థోరైటీస్‌ను నియంత్రణలో ఉంచవచ్చన్నారు. ట్రస్టు కార్యదర్శి పుచ్చకాయల నర్సిరెడ్డి మాట్లాడుతూ సత్యవతి హాస్పిటల్ వారు ఉచితంగా వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు.

పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు

మిర్యాలగూడ, నాగార్జున సాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయురాలు, విద్యార్థినులు బతుకమ్మలను అందంగా పేర్చి ఆడారు. శుక్రవారం నుంచి విద్యాసంస్థలకు దసరా సెలవులు కావడంతో ముందస్తుగా బతుకమ్మ ఆడి సందడి చేశారు.

– సాక్షి, నెట్ వర్క్



అడవిదేవులపల్లి : మొల్కచర్ల ప్రాథమికోన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



మాడుగులపల్లి : కుక్కడం ప్రాథమిక పాఠశాలలో..



వేములపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో ..



దేవరకొండ : లిటిల్ ఫ్లవర్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో..



మిర్యాలగూడటౌన్ : ఆదిత్య స్కూల్‌లో..



తిరుమలగిరి(సాగర్) : గ్రేట్‌వే పాఠశాలలో..



నాగార్జున సాగర్ : బతుకమ్మలతో న్యూకిడ్స్ స్కూల్ విద్యార్థులు



గుర్రంపోడు : పిట్టలగూడెం జెడ్పీహెచ్‌ఎస్‌లో..



మిర్యాలగూడ టౌన్ : సెయింట్ జాన్స్ స్కూల్‌లో..